క్లుప్తంగా

డయేరియాపై అప్రమత్తంగా ఉండండి

సత్తుపల్లిటౌన్: వర్షాకాలం సీజనల్‌లో వ్యాప్తి చెందే డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్ అన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో డయేరియాపై ఇంటింటా ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శారారాణి, రామారావు, ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి గడ్డం వివేక్‌ను కలిసిన మాలమహానాడు నాయకులు



సత్తుపల్లి: రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్ వెంకటస్వామిని సత్తుపల్లి పట్టణ మాల మహానాడు బృందం సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పిల్లి సురేష్, రామారావు, కోపల్లి రత్తయ్య, డాక్టర్ సురేష్ రామాల, పిల్లి వెంకటేశ్వర్లు, కటుకూరి కృష్ణ, పప్పుల శ్రీనారాయణ, కుందుల గురవయ్య, రామకృష్ణ, బెల్లం చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

తల్లాడ: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వచ్ఛ మిత్ర కార్మికులను ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని కార్మికులు సోమవారం మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రస్తుతం స్వచ్ఛ మిత్ర కార్మికులకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వేతనాలు చెలిస్తున్నారని, అలా కాకుండా ప్రభుత్వమే చెల్లించాలని ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛ మిత్ర సంఘం నాయకురాళ్లు చిన్నమ్మ, మౌనిక, రాధా, మరియమ్మ, తెళ్లపుట్ల యేసు, షేక్ నసీరా, ఝాన్సీ, గోపాల్‌రావు పాల్గొన్నారు.

మిస్ట్ విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సింగపూర్ కంపెనీ హేమోటిక్ పిటియి లిమిటెడ్ ఆధ్వర్యాన బీటెక్ విద్యార్థులకు సీఎస్‌సీ, ఏఐఎంఎల్ విభాగాలలో వారం రోజుల పాటు శిక్షణా కార్యక్రమం చేపట్టారు. వీరికి సోమవారంతో శిక్షణ ముగిసినట్లు ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఐక్యూ కోఆర్డినేటర్ రామచంద్రరావు, విభాగాధిపతులు మహేశ్వరరావు, రాజా జాకబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంచుతున్నాం..



కందుకూరు సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి

వేంసూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడకుండా సబ్ స్టేషన్ల సామర్థ్యం పెంచుతున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ ఈ.శ్రీనివాసాచారి అన్నారు. సోమవారం కందుకూరు సబ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌టీ డీఈఈ బద్రు పవార్, సత్తుపల్లి ఆపరేషన్ డీఈఈ రాములు, సత్తుపల్లి ఏడీఈ ప్రసాద్ రావు, వేంసూరు ఏఈ అంకారావు, ఎల్ఐ రమణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారంలో ఉపాధిహామీ పనుల్లో కూలీలు



నిరీక్షణ తప్పదా?

- రెండు నెలలుగా ఆగిన వేతనాలు
- ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలు
- రూ.కోటిపైగా నిలిచిపోయిన చెల్లింపులు

ఏన్కూరు: మండుటెండలను సైతం లెక్క చేయకుండ చెమటోడ్చి పనులు చేసిన ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో అందడం లేదు. వారం వారం జరగవలసిన చెల్లింపులు రెండు నెలలుగా చెల్లించలేదు. దీంతో రెక్కడితేగాని డొక్కడాని కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 11,574 ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉన్నాయి.ఈ ఏడాది 5,021 కుటుంబాల్లో ఉపాధిహామి పనుల్లో పాల్గొన్నారు. రోడ్ల నిర్మాణం పనులు , పంటకాలువల్లో పూడికతీత పనులు,కందకాలు, వరదమళ్లింపు కాలువలు, కొత్త కాలువలు పనులు చేశారు. 8,317 మంది కూలీలు పనులకు హాజరయ్యారు. సగటున 25 రోజులు పనిదినాలు కల్పించారు. మొత్తం 1,26,868 పనిదినాలు కల్పించారు. కనీస వేతనం ఒక్కొక్క కూలీకి రూ.276.58 ఇచ్చారు. మొత్తం కూలీలకు ఇప్పటి వరకు రూ.3 కోట్ల 69లక్షల 22 వేలు వేతనాలు చెల్లించారు. గత రెండు నెలల నుంచి చెల్లింపులు చేయకపోవడతో రూ.కోటి వరకు ఆగిపోయాయి. దీంతో కూలీలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు.

చెల్లింపులు జరగడం లేదు..



కూలీ పనులు చేసుకొని వచ్చిన డబ్బుతో కిరాణం, కూరగాయలు కొనుక్కొని దినం గడుపుతున్నాం. ఎండలను సైతం లెక్క చేయకుండా ఉపాధిహామీ పనులకు వెళ్లి పనులు చేశారు. రెండు నెలలుగా చెల్లింపులు చేయలేదు. దీంతో ఇంట్లో ఇబ్బందులు పడుతున్నాం. చెల్లింపులు వెంటనే జరగాలి.

– ఎస్ నాగమణి, ఉపాధికూలీ

బిల్లులు చేసాం..



మండలంలో ఇప్పటి వరకు జరిగిన ఉపాధిహామీ పనులకు బిల్లులు చేశాం. రెండు నెలలుగా వేతనాలు రావడంలేదు. మేము బిల్లులు చేసి పంపించా.. పై నుంచి రావడం లేదు. సుమారు రూ.60 లక్షల నుంచి రూ.కోటి వరకు బిల్లులు ఆగిపోయాయి.

– సూరయ్య, ఏపీఓ, ఏన్కూరు

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు



వైరా: మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్

వైరా: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. అదే విధంగా మధిరలోని రైతుభరోసా నగదును సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు జమ చేశారని, నిత్యం రైతు సంక్షేమాన్ని కాంక్షిస్తూ పరిపాలన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు, నాయకులు రాజశేఖర్, జైపాల్ తదితరులున్నారు.



మధిర: కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ నరసింహారావు

మిర్చి కొనుగోళ్లు ప్రారంభం

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు మొదలయ్యాయి. మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు ఆధ్వర్యాన సోమవారం జెండా పాట నిర్వహించగా మిర్చి క్వింటాకు గరిష్టంగా రూ.14,511 ధర నిర్ణయించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన మిర్చి తీసుకొచ్చి గిట్టుబాటు ధర పొందాలని, వ్యాపారులు కూడా రైతులను మేలు జరిగేలా ధర నిర్ణయించాలని సూచించారు. మార్కెట్ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు వాసిరెడ్డి రామనాథం, కిషోర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గెలిపించే బాధ్యత మాదే..



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు దయానంద్

సత్తుపల్లి: మా ఎన్నికల్లో గెలుపు కోసం మీరు ఎలా కష్టపడ్డారో.. మిమ్మల్ని గెలిపించే బాధ్యత మేమే తీసుకుంటామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. సోమవారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివవేణు అధ్యక్షతన నిర్వహించిన సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిచేలా ఇప్పటి నుంచే వ్యూహాలు సిద్ధం చేసుకోవాలని, గ్రూపులను, చిన్న సమస్యలను పక్కపెట్టి పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించుకునేలా కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. మట్టి మాఫీయా అంటూ సరికొత్త ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై ఎటువంటి చర్చకైనా తాము సిద్ధమేనన్నారు. ఈ సమావేశంలో వేంసూరు, పెనుబల్లి, సత్తుపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, పొంది వెంకటేశ్వరరావు, శివవేణు, బుక్కా కృష్ణవేణి, పుచ్చకాయల సోమిరెడ్డి, దోమ ఆనంద్, నారాయణవరపు శ్రీనివాసరావు, చల్లగుళ్ల నర్సింహారావు, తోట సుజలరాణి, దూదిపాల రాంబాబు, పద్మజ్యోతిరెడ్డి, పింగళి సామేలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న భాగం హేమంతరావు

చింతకాని: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని లచ్చగూడెంలో జరిగిన సీపీఐ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. హామీలు అమలు చేయకపోతే కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కూడా పడుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తుందన్నారు. కమ్యూనిస్టుల పోరాటం లేకుండా దేశంలో ఏ పథకం రూపుదిద్దుకోలేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తులు ఉన్నా లేకున్నా సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సభకు ముందు పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్టీ మండల కార్యదర్శిగా దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులుగా అబ్బూరి మహేష్, మార్గం శ్రీను లతో పాటు మరో 48 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహారావు, సీతామహాలక్ష్మీ, రవీంద్రబాబు, శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఏసు, శ్రీరాములు, రవి, విజయమ్మ, మోహన్‌రావు, మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి, కేసు నమోదు

చింతకాని: మండలంలోని నాగిలిగొండలో చాట్ల మణెమ్మపై చాట్ల కిట్టయ్య దాడి చేయగా పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఇరువురి ఇళ్ల మధ్య గెట్టు తగాదా ఉండగా, ఆదివారం రాత్రి గొడవ జరగడంతో మణెమ్మపై కిష్టయ్య రాళ్లు, కర్రతో దాడి చేశాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

- బోనకల్ మండలం చొప్పకట్లపాలెంకు చెందిన నంద్యాల నాగేశ్వరరావుపై సోమవారం కేసు నమోదైంది. చింతకాని మండలం నాగులవంచలో నాగేశ్వరరావుకు మూడెకరాల భూమి ఉండగా చొప్పకట్లపాలెంకు కిలారు సురేష్ కొనుగోలు చేశాడు. ఆ భూమిలో సురేష్ పత్తి విత్తనాలను నాటితే ఆదివారం నాగేశ్వరరావు ట్రాక్టర్‌తో దున్నించాడు. దీంతో సురేష్ తనకు రూ.40 వేల నష్టం ఎదురైందని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

కల్లూరు: కల్లూరులో ప్రధాన జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కల్లూరు మండలం పడమటి లోకవరం గ్రామానికి చెందిన బొడ్డు నరసింహారావు బైక్ నడుపుతుండగా ముత్యాల యల్లారావు వెనకాల కూర్చున్నాడు. వీరిద్దరు గ్యాస్ సిలిండర్‌తో సత్తుపల్లి రోడ్డు వైపు వెళ్తుండగా ఖమ్మం నుంచి సత్తుపల్లి వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో యల్లారావు కుడి కాలు, తలకు తీవ్ర గాయాలు కావడంతో కల్లూరులో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

ఏన్కూరు: మండలంలోని గార్లొడ్డు ప్రాథమిక పాఠశాలను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గార్లొడ్డు సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు పాఠశాలలో సమస్యలు వివరించి నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా లాలూనాయక్, ఆనందరావు, రమణ, రవి, శ్రీను పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

మధిర: ఈ నెల 21 22వ తేదీల్లో ఖమ్మంలో జరిగే టీజీఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు వెంకటేశ్వరరావు, సుధాకర్ కోరారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ.. నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా ప్రచార జీపు జాతా సోమవారం మధిర డిపోకు చేరుకుంది. కార్యక్రమంలో సుధాకర్, నాగేశ్వరరావు, బాబు, వెంకన్న, నాగుల్ మీరా, కిషోర్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

సన్మానం..

వైరా: ఇటీవల టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వైరాకు చెందిన కట్ల రంగారావును సోమవారం 1984–85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. వైరా ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో రంగారావుతో కలిసి చదివిన స్నేహితుల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. సూతకాని కృపానందం, రవీంద్ర ప్రసాద్, శ్రీనివాస్, సైదులు, శ్రీనివాస్, అతావుల్లా, నరసింహారావు, కోటయ్య, మస్తాన్, కరెంట్ నాగేశ్వరరావు, రవికుమార్, సీతారాములు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

తల్లాడ: ఈ నెల 21, 22 తేదీల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే ట్రేడ్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు తెలిపారు. సోమవారం తల్లాడలో పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో టీయూసీఐ తల్లాడ మండల నాయకులు టి.శ్రీను, రాఘవ, నారాయణ, వెంకటేశ్వర్లు, సత్యం, రామక్రిష్ణ, రమణ పాల్గొన్నారు.

రైతు భరోసాతో రైతులకు అండ



కారేపల్లి: రైతునేస్తం కార్యక్రమంలో తహసీల్దార్ సంపత్‌కుమార్, తదితరులు



బోనకల్: వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు



తల్లాడ: మల్లవరంలో వీక్షిస్తున్న కల్లూరు ఆర్డీఓ రాజేందర్ గౌడ్, అధికారులు

- కొణిజర్ల/వైరారూరల్/కారేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా కార్యక్రమం సన్న చిన్నకారు రైతులకు అండ అని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, తహసీల్దార్లు కేవీ.శ్రీనివాస్, సంపత్‌కుమార్ తెలిపారు. కొణిజర్ల, వైరారూరల్, కారేపల్లి మండలంలోని రైతు వేదికల్లో సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో వారు పాల్గొని.. వడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను రైతులతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రైతు సమస్యలు, సాగు మెళకువలు సూచించేందుకు వీడియో కాన్ఫరెన్స్ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి మంగళవారం ఈ రైతు వేదికలల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వడ్డె నారాయణరావు, సూరంపల్లి రామారావు, శ్రీనివాసరావు, ఎంపీడీఓలు సరస్వతి, సురేందర్, ఏఓలు మయాన్ మంజుఖాన్, అశోక్‌కుమార్, ఏఈఓ సైదులు, రైతులు పాల్గొన్నారు.
- బోనకల్/ఎర్రుపాలెం/ముదిగొండ: బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్, ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు, ముదిగొండ మండలంలోని పమ్మి, ముదిగొండ, మాధాపురం రైతు వేదికల్లో సోమవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమాన్ని రైతు వేదికల్లో నాయకులు, రైతులు కలిసి వీడియో కన్ఫరెన్స్‌లో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమాలల్లో మధిర ఏడీఏ స్వర్ణవిజయచంద్ర, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఏఓలు సరిత, వినయ్‌కుమార్, శివసాయి, తహసీల్దార్లు రమాదేవి, ఎంపీడీఓ రమాదేవి, ఉషాశారద, ఆత్మా కమిటీ చైర్మన్ రామకోటేశ్వరావు, మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రమేష్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్, సొసైటీ చైర్మన్ యలగొండస్వామి, ఎంపీఓ వాల్మికి కిషోర్, ఏఈఓలు పాల్గొన్నారు.
- తల్లాడ/కల్లూరురూరల్/సత్తుపల్లిరూరల్/పెనుబల్లి: తల్లాడ మండలంలోని తల్లాడ, మల్లవరం, కుర్నవల్లి గ్రామాలు, కల్లూరు మండలంలో కొర్లగూడెం, కల్లూరు, ముచ్చవరం గ్రామాల్లో, సత్తుపల్లి మండలంలోని కొత్తూరు, కాకర్లపల్లి, సదాశివునిపాలెం గ్రామాల్లో, పెనుబల్లి మండలంలోని పెనుబల్లి, అడవిమల్లేల, కుప్పెనకుంట్ల గ్రామాల్లోని రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలల్లో కల్లూరు ఆర్డీఓ రాజేందర్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, తహసీల్దార్లు సురేష్‌కుమార్, పులి సాంబశివుడు, ఏఓలు ఎండి.తాజుద్దీన్, వై.శ్రీనివాసరావు, ఎంపీడీఓలు సురేష్, చంద్రశేఖర్, ఈఓ కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు దయానంద్, ఏఎంసీ చైర్మన్ ఆనంద్, ఏడీఏ వి.శ్రీనివాసరెడ్డి, హెచ్ఓ శ్రావణి, ఏఈఓలు సందీప్, ఆశాజ్యోతి, అనూష, సాయి వాసంతి పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

కల్లూరు: కల్లూరు నూతన బస్టాండ్‌లో ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి నాలుగు సంవత్సరాలుగా నిత్యం చల్లటి తాగునీటితో పాటు 3 నెలల వేసవి కాలంలో ఉచిత మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం హర్షణీయమని, కల్లూరు మండల ప్రజలు, దాతల సహకారం మరువలేనిదని ఆర్టీసీ సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారంతో 90రోజులు పూర్తి కావడంతో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, మున్సిపాలిటీ ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావుతో కలిసి ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనంద్‌తో కృషితోనే నాలుగేళ్లుగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. అనంతరం వీబీఓ కిన్నెర ఆనందరావును ఘనంగా సన్మానించారు. ఈ నెల 27న మద్ది, ద్రాక్షారామం, ద్వారకా తిరుమల, వాడపల్లి, పెనుగొండ దేవాలయాలకు ఒకరోజు ట్రిప్ కేవలం రూ.1,000తో బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రసాద్, మాదిరాజు అన్నంరాజు, కృష్ణారెడ్డి, నరసింహారావు, శివకుమార్ నాయక్, సురేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం



తల్లాడ: మాట్లాడుతున్న కల్లూరు ఆర్డీఓ రాజేందర్ గౌడ్

కల్లూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతితో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కల్లూరు తహసీల్దార్ పులి సాంబశివుడు, కొర్లగూడెంలో డీటీ బాబ్జి ప్రసాద్ తెలిపారు. సోమవారం రావికంపాడు గ్రామాల్లో జరిగిన భూ భారతి గ్రామసభలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుల దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉమామహేశ్వరరావు, సుజాత, రైతులు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని రంగంబంజరలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేందర్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. రైతులు భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఆర్ఐలు బాస్కర్, ఖాజా మొయినుద్దీన్, స్టాలిన్ పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు..

సత్తుపల్లిరూరల్: మండలంలోని రుద్రాక్షపల్లి పాఠశాలలో డాక్టర్ దాసరి దివాకర్‌రెడ్డి పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్సిళ్లు, కంబాక్స్‌లు అందించగా.. గుడిపూడి దుర్గారావు జ్ఞాపకార్థం వారు కుమారుడు గాంధీ మధ్యాహ్న భోజనానికి ప్లేట్స్ అందించారు. అదే విధంగా కాకర్లపల్లి బోడు పాఠశాలలో పని చేస్తున్న రాజ్యాలక్ష్మి, రామారావులు రూ.8వేల విలువైన నోట్‌పుస్తకాలు, పెన్నులు సోమవారం విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, హెచ్ఎం పి.సత్యనారాయణరెడ్డి, కె.నవరాజు, అనురాధ, రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అల్లీనగరం ప్రాథమిక పాఠశాలలో..



విద్యార్థులకు అందించిన బ్యాగ్‌లతో దాత లింగరాజు, ఉపాధ్యాయులు

మధిర: అల్లీనగరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కంచం గంగరాజు తనయుడు, ప్రముఖ కార్డియాలజిస్ట్ లింగరాజు ఆర్థిక సహకారంతో సోమవారం బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెల్లమేకల శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని తెలిపారు. క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి ఉత్తమ ఫలితాలతో పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసిరెడ్డి బాబురావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వెంకటాపురం పాఠశాలలో..

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కర్నాటి సుధాకర్‌రెడ్డి రూ.12వేల విలువైన నోట్ పుస్తకాలను వితరణ చేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక సమావేశంలో దాత సుధాకర్‌రెడ్డితో కలిసి ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, హెచ్ఎం వెల్లంకి నాగరాజు పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో సొసైటి చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో నిర్మల, వేముల వెంకటేశ్వరరావు, స్వర్ణ నాగేశ్వరావు, వెన్నపూస నాగిరెడ్డి, మేకల రమేష్, కుంపటి శ్రీను తదితరులున్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు..

కల్లూరురూరల్: మండలంలోని ఐసీడీఎస్ చంద్రుపట్ల సెక్టార్ పరిధిలో గల ఎర్రబోయినపల్లి గ్రామంలో గల నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ప్రీస్కూల్ విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన పోర్టు లక్ష్మయ్య ఛారిటబుల్ ట్రస్ట్ నుంచి స్కూల్ బ్యాగ్‌లు, పలకలు, నోట్ పుస్తకాలు, పెన్సిల్స్‌ను ట్రస్ట్ నిర్వాహకులు పోట్రు కిరణ్ సోవారం అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాలు..

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం జెడ్పీహెచ్ఎస్‌లో గత ఏడాది పది ఫలితాలు సాధించిన విద్యార్థులకు సోమవారం కందిబండ్ల బాలమురళీకృష్ణ జ్ఞాపకార్థం ఆయన సతీమణి శైలజారాణి నగదు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. 561 మార్కులు సాధించిన గుమ్మా నిరంజన్‌కు రూ.11 వేలు, యంగల హర్ష(516)కు రూ.5 వేలు, కూరకుల అలేఖ్య(512)కు రూ.4 వేలు, పూజల నాగవైష్ణవి(511)కి రూ.2 వేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర్యకుమారి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పమ్మి ప్రాథమిక పాఠశాలలో..

ముదిగొండ: మండలంలోని పమ్మి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రూ.5వేలు విలువైన నోట్ పుస్తకాలను, పెన్నులను విద్యార్థులకు వితరణగా సోమవారం అందించారు.

బీఆర్ పురంలో ఎఫ్ఎల్ఎన్ క్యాంపు

ఏన్కూరు: బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని బురుద రాఘవాపురంలో ఎఫ్ఎల్ఎన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులలో పఠానాసక్తి పెంచడానికి ప్రతి రోజూ సాయంత్రం రెండు, మూడు పీరియడ్‌లో బాల బాలికలకు లైబ్రరీ పీరియడ్ నిర్వహించి కథల పుస్తకాలు చదివించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సాగి సుజాత మాట్లాడుతూ.. విద్యార్థులు ధారళంగా చదవడం నేర్చుకోవడానికి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, పుల్లయ్య శ్రీనివాసరావు, విజయశ్రీ, భారతి, నాగేశ్వరరావు, భావ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్లలో కళాబృందం ప్రదర్శనలు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హరిజన వాడ ప్రాథమిక పాఠశాల, కేంద్ర ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం వారు ప్రదర్శన నిర్వహించారు. చాపలమడుగు కొటేశ్వరరావు, బంక భద్రయ్య, పరకాల అజయ్, బాణోత్ రవిల ఆధ్వర్యంలో తనికెళ్ల ఉన్నత పాఠశాల నుంచి ఆఫీస్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాబృందం సభ్యులు పాటలు, మ్యాజిక్‌షో, ఫైర్ రవి ఫైర్ షో ద్వారా చిన్నారులను ఆకర్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.అబ్రహం, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎస్ శైలజ, వి.రామ్మోహనరావు, హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కె.చంద్రశేఖరరావు, పీడీ శ్రీనివాస్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బడిబాటపై కళా బృందం గేయాలు

తల్లాడ: తల్లాడలో సోమవారం బడిబాటలో భాగంగా సమాచార శాఖ, పౌర సంబందాల శాఖా ఆధ్వర్యంలో జాన్ ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బడుల్లో చదివితే అందుతున్న సౌకర్యాలు గురించి, డ్రాఫ్ అవుట్స్ పిల్లలను పాఠశాలల్లో చేర్పించే విధంగా కళారూపాలు ప్రదర్శించారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

ఏన్కూరు: బీజేపీ పాలనలోనే దేశాభివృద్ధి గణనీయంగా జరిగిందని బీజేపీ ఓబీసీ మోర్చా కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు అన్నారు. బీజేపీ పాలన 11 ఏండ్లు ముగిసిన సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ ల పిలుపు మేరుకు వికసిత్ భారత్ సుపరిపాలన అనే అంశంపై సోమవారం ఏన్కూరులో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, రమేష్, కృష్ణ, రాజేందర్, రంగయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శాంతినికేతన్ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్: సోమవారం విడుదలైన ఇంటర్ ఫలితాలలో ఎంపీసీలో సత్తుపల్లికి చెందిన శాంతినికేతన్ విద్యార్థులు స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌లు సాధించారు. కళాశాలకు చెందిన డి.శ్రీవిద్యపల్లవి 468/470 మార్కులు, సీహెచ్ మానస 468/470 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్‌లో నిలిచారు. అదే విధంగా బైపీసీ విభాగంలో సీహెచ్ హర్షవర్ధన్ 433/440, జి.మేఘన 432/440 మార్కులుతో విజయం సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మమంద్రారెడ్డి, కరస్పాండెంట్ దొడ్డా శ్రీనివాసరెడ్డి అభినందించారు.

విద్యాభారతికి స్టేట్ సెకండ్‌ర్యాంక్..

పట్టణంలోని విద్యాభారతి జూనియర్ కళాశాల విద్యార్థిని ఎంపీసీ విభాగంలో ఎండి షంషద్దీన్‌సా బేగంకు 467/470కి మార్కులు సాధించి స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించింది. కరస్పాండెంట్ జి.వి.లింగారెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంక్

మధిర: తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు సోమవారం విడుదల చేసిన ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో మధిర శ్రీనిధి కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. కళాశాలకు చెందిన పి.నందిని స్టేట్ ఫస్ట్ ర్యాంక్ 468/470, ఎం.ప్రణీత్ శర్మ స్టేట్ సెకండ్ ర్యాంక్ 467/470 మార్కులు సాధించినట్లు కళాశాల చైర్మన్ వై.అనీల్ కుమార్ నెహ్రూ తెలిపారు.